38

# గుర్రపు గుడ్డు

తిమ్మ సముద్రం అనే ఊరిలో బంగారయ్య అనే వ్యాపారి ఉండేవాడు.

అతను విపరీతమైన పిసినారి. ఎంగిలిచేత్తో కాకిని కూడా తరిమేవాడు కాదు. అలా చేస్తే చేతికున్న ఎంగిలి మెతుకులు రాలి, కాకి ఎక్కడ తింటుందోనన్న భయం! అంతటి పిసినారి అతను. అందుకే అతని దగ్గరికి ఎవరూ పనిచేయడానికి వచ్చేవారు కాదు. ఒకవేళ గతిలేక వచ్చినా, కొద్దిరోజులుండి పారిపోతుండేవారు.

ఇలావుండగా ఒకరోజున బంగారయ్య దగ్గరికి గోపయ్య అనే యువకుడు వచ్చాడు.

"అయ్యా...నేను చాలా పేదవాడ్ని. మీరు ఏ పని చెప్పినా చేస్తూ తమ కాళ్ళ దగ్గరే పడి వుంటాను" అంటూ ప్రాధేయపడ్డాడు.

"సరేరా...మరి, జీతం ఎంతిమ్మంటావు ?" అన్నాడు బంగారయ్య.

"తమ దయ! తమరేమిచ్చినా కాదనను" అన్నాడు గోపయ్య వినయంగా.

"రెండు పూటలా నాకు తోచిన తిండి పెడ్తాను.., ఎక్కువా తక్కువా అనకూడదు. నా ఇంటి ముందు వసారాలో పడుకోవచ్చు. ఇంక వేరే జీతం ఇయ్యను. ఒక ఏడాది పోయినతర్వాత నాకు తోచినదేదో ఇస్తాను. రాత్రి-పగలు అనక నేను చెప్పిన పని అంతా చేయాలి. నీ కిష్టమైతే ఉండు" అన్నాడు బంగారయ్య.

"సరే... తమరి దయ !" అంటూ గతిలేక ఒప్పుకున్నాడు గోపయ్య.

అప్పటినుంచి గోపయ్య ఆ ఇంటిలో ఒళ్ళు దాచుకోకుండా అడ్డమైన గొడ్డుచాకిరీ చేస్తూ, బంగారయ్య పెట్టే నాలుగు మెతుకులు తింటూ గడపసాగాడు.

ఆ ఊళ్ళోనే గోపయ్య పెదనాన్న ఉండేవాడు. కొన్నాళ్ళకి అతను మంచం పట్టేసరికి ఆయన్ని చూసేవాళ్ళు ఎవరూ లేకపోవడంతో తన మకాంని ఆయన గుడిశకి మార్చాడు.



తన ఇంటిలో గోపయ్య ఊరికే ఉండడం ఇష్టంలేని బంగారయ్య- తన ఇంట్లో పనికి ఇబ్బంది ఉండకూడదన్న షరతు మీద అందుకు ఒప్పుకున్నాడు.

ఏడాది గడిచింది.

ఒకరోజున గోపయ్య తన జీతం గురించి బంగారయ్యని అడిగాడు.

"జీతమా..? ఊ... ఇస్తానుండు" అంటూ లోనికి వెళ్లాడు బంగారయ్య.

ఏమిస్తాడోనన్న ఆశతో ఎదురుచూడసాగాడు గోపయ్య.

బంగారయ్య లోనుంచి బయటకు వచ్చి "ఇదుగో.., ఇది నువ్వు ఏడాది చేసినదానికి జీతం!" అంటూ ఒక 'పుచ్చకాయ గింజ'ని ఇచ్చాడు.

దానిని చూసి నిర్ఘాంతపోయి, "ఇదా..?" అన్నాడు గోపయ్య.

"ఏ... ఇది తక్కువనుకుంటున్నావా? ఇది బంగారంతో సమానం. దీనిని తీసుకువెళ్లి నీ దొడ్లో పాతుకో. నాలుగు నెలల్లో బంగారంవంటి పుచ్చకాయల్ని కాస్తుంది. వాటిని సంతలో అమ్ముకుంటే కావల్సినంత డబ్బు!" అన్నాడు బంగారయ్య.

చేసేదిలేక, ఉసూరుమంటూ ఆ గింజని తీసుకువెళ్లి దొడ్లో పాతాడు గోపయ్య.

వారం తిరక్కుండానే ఆ గింజ మొలిచి, త్వరత్వరగా ఎదిగింది. నాలుగు నెలలయ్యేసరికి ఒకే ఒక పెద్దకాయని కాసింది. ఎన్నో కాయలు కాస్తుందనుకున్న గోపయ్యకి ఆ ఒక్క కాయను చూసేసరికి ఎంతో నిరుత్సాహం కలిగింది. అయితే... ఆ ఒక్క కాయ మాత్రం చాలా పెద్దగా కాసింది. దాన్ని కోసి భుజాన పెట్టుకొని సంతలో అమ్మడానికి బయలుదేరాడు గోపయ్య.

అలా వెళ్తుంటే అతనికి ఆనందుడనే యువకుడు ఎదురయ్యాడు. అతను ఆ ఊరి రాజుగారి సేనాని కొడుకు. అతనికి మతిస్థిమితం తక్కువ.

గోపయ్య భుజం మీదున్న పుచ్చకాయను చూసేసరికి, సంబరపడుతూ "భలే... భలే... ఇదేమిటి?" అని అడిగాడు ఆనందుడు.

అసలే విచారంతోవున్న గోపయ్యకి ఆ ప్రశ్నతో వళ్ళు మండి "ఇది గుర్రపు గుడ్డు" అన్నాడు.

"గుర్రపు గుడ్డా..! అయితే, ఇది గుర్రంపిల్లని పెట్టుందన్నమాట. దీన్ని నాకు అమ్మవూ..?!" అన్నాడు బ్రతిమాలుతూ.

వీడెవడో పిచ్చివాడులాగా ఉన్నాడనుకుని, "అమ్ముతాను. దీని వెల...30 బంగారు నాణాలు!" అన్నాడు గోపయ్య పరిహాసంగా.

వెంటనే ఆనందుడు జేబులోంచి 30 బంగారు నాణాలూ తీసి గోపయ్యకి ఇచ్చాడు. సేనాని కొడుకు కదా... డబ్బుకేం తక్కువ?!

గోపయ్య నిర్ఘాంతపోయి, ఆ డబ్బు తీసుకుని ఆ పుచ్చకాయని ఆనందుడికిచ్చి "జాగ్రత్తగా తీసుకువెళ్లు. క్రిందపడిందో... గ్రుడ్డు పగిలిపోయి, పిల్ల బయటకి వచ్చి పారిపోతుంది" అని హెచ్చరించాడు.

కొంతదూరం వెళ్లేసరికి, వాలు ప్రదేశం వచ్చింది. అక్కడ నడుస్తుండగా పొరపాటున పట్టుతప్పి ఆ పుచ్చకాయ క్రిందపడి బరబరా దొర్లుకుపోసాగింది.

దానివెనకే పరిగెత్తసాగాడు ఆనందుడు.

పోయిపోయి ఆ పుచ్చకాయ ఒక పొదలో దూరిపోయింది. అదే సమయానికి ఆ పొద వెనకనే వున్న ఒక గుర్రం పిల్ల ఆ చప్పుడుకి బెదిరి పరిగెత్తసాగింది.

దానిని చూసి ఆనందుడు "అదుగో... గుడ్డు పగిలి పిల్ల బయటకు వచ్చి పరుగెత్తింది" అంటూ దాని వెంటపడ్డాడు.

ఆ గుర్రంపిల్ల అలా పరుగెత్తి పరుగెత్తి బంగారయ్య ఇంట్లో దూరి కనుమరుగయింది.

అప్పటికి అడ్డదారి వెంట అక్కడికి వచ్చిన గోపయ్య జరిగిందంతా గమనించాడు.

గోపయ్యను చూసి జరిగిందంతా చెప్పి భోరున ఏడ్చాడు ఆనందుడు.

గోపయ్య -"ఏడవకు. ఆ ఇంట్లో బంగారయ్య అనేవాడున్నాడు. వాడు నీ గుర్రంపిల్లను దాచేస్తాడు. వెళ్లి వాడిని బాగా కొట్టు. వాడు నీ గుర్రంపిల్లని ఇస్తాడు. దానిని ఇయ్యకపోతే 50 బంగారు నాణాలను ఇమ్మను. దాంతో మరో మంచి గుర్రపు గుడ్డు కొనుక్కోవచ్చు" అని సలహా చెప్పాడు.

వెంటనే ఆనందుడు బంగారయ్య ఇంట్లోకి జొరబడ్డాడు.

అదే సమయానికి అలికిడి విని బయటకు వచ్చాడు బంగారయ్య. వెంటనే అతన్ని పట్టుకొని, "నా గుర్రం పిల్లని నాకిచ్చేయి!" అంటూ చితకబాదసాగాడు ఆనందుడు.

"నీ గుర్రంపిల్ల సంగతి నాకు తెలియదు బాబోయి..!" అన్నా వినిపించుకోలేదు.

"అయితే...50 బంగారునాణాలు ఇచ్చేయి" అంటూ మళ్ళీ బాదసాగాడు.

ఈ బాధ పడలేక 50 నాణాలు ఇచ్చి వదిలించుకున్నాడు బంగారయ్య.

వాటిని తీసుకుని గోపయ్య దగ్గరకి వచ్చి "ఇదుగో... ఈ డబ్బుతో మరో మంచి గుర్రంగుడ్డు ఇయ్యి" అన్నాడు.

"సరే... ఈసారి గుర్రం గుడ్డు పెట్టినప్పుడు ఇస్తాను" అంటూ ఆ నాణాలు తీసుకున్నాడు గోపయ్య.

ఆ మొత్తం డబ్బుతో వ్యాపారం చేసుకుని ధనికుడయ్యాడు గోపయ్య.

★★★